క్లుప్తంగా

పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


పెదలింగంపాడులో రైతులకు మందులను అందిస్తున్న ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్

భీమడోలు: పశువుల ఆరోగ్య భద్రతపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని భీమడోలు సబ్ డివిజనల్ సహాయ సంచాలకులు డాక్టర్ ఇక్కుర్తి సాయి రమేష్ అన్నారు. మండలంలోని సూరప్పగూడెం, పెదలింగంపాడులో బుధవారం ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యులు ఐ. రమ్యశ్రీ ఎం. హరికృష్ణ ల ఆధ్వర్యంలో గేదెలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సూరప్పగూడెంలో శిబిరాన్ని ఏడీ సాయి రమేష్ ప్రారంభించారు. పెదలింగంపాడులో శిబిరాన్ని ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్ ప్రారంభించారు. పశువులకు నట్టల నివారణ మందు వేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లు, గోపాలమిత్రలు, పాడి రైతులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


కొప్పిశెట్టి వెంకన్న (ఫైల్)

భీమడోలు: సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరుకు చెందిన మతిస్థిమితం లేని కొప్పిశెట్టి వెంకన్న అదృశ్యంపై కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్లితే.. పాతూరుకు చెందిన కొప్పిశెట్టి గంగమ్మ చిన్నకుమారుడు కొప్పిశెట్టి వెంకన్న (40) అనే వ్యక్తి కొన్నేళ్లుగా మతిస్థిమితం సరిగా ఉండడం లేదు. పలుసార్లు ఇంటి నుంచి బయటకు వెళ్లి రెండు, మూడురోజుల్లో తిరిగి వచ్చేవాడు. అయితే ఈనెల 14న ఉదయం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. అయితే గతంలో మాదిరిగానే ఇంటికి తిరిగి వస్తాడని ఎదురు చేసిన తల్లి అతడు రాకపోవడంతో తమ బంధువుల వద్ద పరిసర ప్రాంతాల్లో 15 రోజులుగా ఆచూకీ కోసం గాలించింది. బుధవారం తల్లి గంగమ్మ భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు. ఆచూకీ తెలిసినట్లయితే 944079652, 9154880255కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

గొల్లగూడెంలో వైద్య శిబిరం


వసంత్‌కుమార్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఉంగుటూరు: మాజీ మంత్రి దివంగత వట్టి వసంత్‌కుమార్ వర్ధంతి సందర్భంగా గొల్లగూడెంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వసంత్ యువసేన అధ్యక్షుడు ముత్యాల బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని వసంత్‌కుమార్ తనయుడు వట్టి పవన్ ప్రారంభించారు. ఏలూరు రితీష్ ఆసుపత్రి డాక్టరు గుండె వైద్య నిపుణుడు రితీష్ గుండె పరీక్షలు చేశారు. సుమారు 150 మందికి ఇసీజీ, ఏకో పరీక్షలు ఉచితంగా చేశారు. వైద్య పరీక్షల విభాగాన్ని మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు ప్రారంభించారు. సర్పంచి కరపా శ్రీను, జనసేన నేత పత్సమట్ల భీమరాజు, పాత్తూరి కృష్ణంరాజు (వాసు), వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు చింతల వాసు, మాజీ ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, మానవత రాష్ట్ర కార్యదర్శి సాగిరాజు జానికిరామరాజు, టీడీపీ నాయకుడు వేములపల్లి సుధీర్, వసంత్ యువసేన సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి సాధనకు కృషి చేయాలి

గణపవరం: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి, స్వయం సమృద్ధి సాధనకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని గణపవరం ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు గ్రామాభివృద్ధి ప్రణాళికల తయారీపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్డీ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో బాల సభలు, మహిళా సభలు, గ్రామ వార్డు సభలు నిర్వహించాలని సర్పంచ్‌లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఆర్‌డబ్ల్యుఎస్ రూపేష్, పీఆర్ ఏఈ దుర్గాప్రసాద్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ తులసి, సీహెచ్‌వో విల్సన్, ట్రైనీ మాస్టర్స్ పాల్గొన్నారు.

బ్యాంకులో లాకర్ సౌకర్యం

దెందులూరు: స్థానిక చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు (సీజీజీబీ)లో లాకర్ సౌకర్యాన్ని ఖాతాదారులు వినియోగించుకోవాలని మేనేజర్ టి నాగార్జున కోరారు. బుధవారం బ్యాంక్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకు కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చడంతోపాటు లాకర్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. తమ బ్యాంకులో ఖాతా తెరిచిన వెంటనే ఏటీఎం, ఇంటర్నెట్ సౌకర్యాలు కల్పిస్తామన్నారు.బ్యాంక్ అకౌంటెంట్ ఉప్పలపాడు రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

రోడ్ల కూడళ్లు.. ప్రమాదాలకు పిలుపులు

- ఆదమరిస్తే అంతే సంగతులు
- కానరాని హెచ్చరిక బోర్డులు
- బిక్కుబిక్కుమంటూ వాహనచోదకుల ప్రయాణం


పిప్పరలో ప్రమాదకరంగా మూడు రోడ్ల కూడలి


పిప్పర మెయిన్ సెంటర్‌లో మూడు రోడ్ల కూడలి


గణపవరం సెంటర్‌లో ప్రమాదాలకు నిలయమైన మూడురోడ్ల కూడలి


గణపవరం వంతెన దిగువున మూడురోడ్ల కూడలిలో వాహనాల రద్దీ

గణపవరం: గణపవరం ఆర్‌అండ్‌బీ సెక్షన్ పరిధిలో పలుచోట్ల రహదారులపై ఉన్న మూడు రోడ్ల కూడళ్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ కూడళ్లలో మూడు వైపుల నుంచి ఒకేసారి వాహనాలు వచ్చినప్పుడు ప్రమాదభరితంగా ఉంటోంది. ఎదురుగా వచ్చే వాహనాలు సమీపంలోకి వస్తే తప్ప కనిపించని పరిస్థితి నెలకొనడంతో వాహనచోదకులు ఈ కూడళ్లలో బిక్కుబిక్కుమంటూ వాహనాలు నడుపుతున్నారు. మార్గ సూచికలు, హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో ఆయా కూడళ్లలో మరింత ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి.

గణపవరం పోలీస్ ఐలెండ్ వద్ద ప్రమాద ఘంటిక

గణపవరం సెంటర్‌లో పోలీస్ ఐలెండ్ వద్ద తాడేపల్లిగూడెం, భీమవరం, ఏలూరు రహదారులు కలుస్తాయి. ఈ కూడలిలో వంతెనపై నుంచి వచ్చే వాహనదారులకు భీమవరం, తాడేపల్లిగూడెం రోడ్డు మీదుగా వచ్చే వాహనాలు సమీపంలోకి వస్తే తప్ప కనిపించవు. ఈ కూడలిలో పలు సార్లు వాహనాలు ఢీకొన్న సంఘటనలు, ఇద్దరు ముగ్గురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. గణపవరం బొబ్బిలి వంతెన దిగువన ఉన్న మూడు రోడ్ల కూడలి కూడా ప్రమాదభరితంగా ఉంది. ఆకివీడు, భీమవరం, ఏలూరు వైపు వెళ్లే మూడు రోడ్ల కూడలిలో వాహనాలు ఎదురెదురుగా వచ్చే సందర్భాల్లో సమీపంలోకి వస్తే కనిపించవు. ఈకూడలిలో రోడ్డు మార్జిన్లు ఆక్రమణలతో నిండిపోవడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. వంతెన పైనుంచి వచ్చే వాహనాలు, ఆకివీడు రోడ్డుమీదుగా వచ్చే వాహనాలు సమీపంలోకి వస్తే తప్ప కనిపించవు. ఈ కూడలి కూడా ప్రమాదాలకు నిలయంగా తయారైంది. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ కూడళ్లలో వాహనాలు వెంట్రుక వాసిలో ప్రమాదాల బారి నుంచి బయటపడిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

పిప్పర కూడలిలో వాహనాల రద్దీ

పిప్పర శివారున ఉన్నమూడు రోడ్ల కూడలి కూడా ప్రమాదాలకు నిలయంగా ఉంది. తాడేపల్లిగూడెం, భీమవరంరోడ్డు మీదుగా ప్రయాణించే వాహనాలు గణపవరం వైపు నుంచి వచ్చే వాహనదారులకు దగ్గరగా వస్తే తప్ప కనిపించవు. దీనితో ఈకూడలి ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. పిప్పర ప్రధాన కూడలి కూడా ప్రమాదకరంగా మారింది. తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకు వైపు వెళ్లే మూడు రోడ్లు ఇక్కడ కలుస్తాయి. ఈ కూడలి నిత్యం వాహనాల రాకపోకలతో ఎంతో రద్దీగా ఉంటుంది. భీమవరం, తాడేపల్లిగూడెం వైపు నుంచి వచ్చే వాహనదారులకు అత్తిలి వైపు నుంచి వచ్చే వాహనాలు బాగా దగ్గరగా వస్తే తప్ప కనిపించవు. దీనితో ఇక్కడ ఏ క్షణంలో ఏం ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వాహనాలను నడుపుతుంటారు. ఈ మూడు రోడ్ల కూడళ్లలో మూడు వైపుల నుంచి వచ్చే వాహనాలు ఒకేసారి మలుపు వద్ద ఎదురెదురుగా వచ్చినప్పుడు తప్పుకోవడం గగనంగా ఉంటుంది. వాహనాలు ఎదురెదురుగా సమీపంలోకి అంటే ఐదారు అడుగుల దూరంలోకి వస్తే తప్ప కనిపించకపోవడం వల్ల నిత్యం ప్రమాదం పొంచి ఉంటుంది. ఇలాంటి ప్రమాదకర మలుపుల వద్ద రోడ్డు మార్జిన్లలో ఉన్న ఆక్రమణలు తొలగించి, హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రణలు, మార్గ సూచికలు ఏర్పాటు చేస్తే కొంతైనా ఫలితం ఉంటుందని వాహనదారులు కోరుతున్నారు.

పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సాయం అందజేత


కొమ్మర స్కూల్ అభివృద్ధికి ఆర్థికసాయం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు వేణుబాబు

నిడమర్రు: బువ్వనపల్లి సంకు కృష్ణాజీ గార్డెన్‌లో బుధవారం లయన్స్ క్లబ్ జోన్ సోషల్ కార్యక్రమం చైర్‌పర్సన్ పోశింశెట్టి రామమూర్తి అధ్యక్షతన సందడిగా నిర్వహించారు. జోన్‌లోని లైన్స్ సభ్యులు కుటుంబాలతో హాజరై వివిధ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆ క్లబ్ జిల్లా అధ్యక్షుడు కాకరాల వేణుబాబుకు ఇంటర్నేషనల్ లైన్స్ క్లబ్ ఫండింగ్ కొరకు వెయ్యి డాలర్లను (రూ.86 లక్షలు) అధ్యక్షుడు పచ్చిపులుసు నాగేశ్వరరావు అందించారు. కొమ్మర ప్రభుత్వ స్కూల్ డిజిటల్ విద్యలో భాగంగా స్మార్ట్ టీవీ కొనుగోలుకు రూ.40 వేల చెక్కును ఆ పాఠశాల సిబ్బందికి వేణుబాబు అందించారు. లయన్స్ సభ్యులు రామమూర్తి, నాగేశ్వరరావును సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వివిధ హోదాల్లో సేవలు అందిస్తున్న పలువురికి మెమెంటోలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ, జిల్లా వైస్ గవర్నర్ పాపారావు నాయుడు,ఆర్‌సీ కృష్ణమూర్తి, ఆర్‌వీఎస్ రాజు, పుట్టా జయశ్రీ, కార్యదర్శి సత్తినీడు నాని తదితరులున్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ పరిధిలో వివిధ సబ్‌స్టేషన్లల్లో కండక్టర్ల మార్పు, వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల 31న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. భీమడోలు సబ్ స్టేషన్ పరిధిలోని భీమడోలు, ద్వారకా తిరుమల, ఉంగుటూరు, పెదవేగి, దెందులూరు, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల్లో వ్యవసాయ, తాగునీటి సర్వీసులకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారు జామున 5 గంటల ఉంటుందని పేర్కొన్నారు. వేగివాడ సబ్‌స్టేషన్ పరిధిలో వేగివాడ, చక్రాయిగూడెం, కె.కన్నాపురం, చల్లచింతలపూడి గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. పెదవేగి మండలం కవ్వగుంట, పెదవేగి, సూర్యారావుపేట, లక్ష్మీపురం, ఎంఆర్‌సీ కాలనీ, గార్లమడుగు, వెంకటకృష్ణాపురం, జగన్నాథపురం, వంగూరు, లక్ష్మీపురం, కూచిపూడి, న్యాయంపల్లి, రామశింగవరం గ్రామాలకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. ఏలూరు డీ-4 సెక్షన్ పరిధిలో ఆటో నగర్, కొమడవోలు, తూర్పులాకులు, సాయినగర్‌లలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని తెలిపారు.

నిరుద్యోగులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం

దెందులూరు: కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదని, 20 లక్షల ఉద్యోగాలు, నెలకు ఒక్కొక్కరికీ రూ.3వేలు నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారని ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్ ప్రశ్నించారు. బుధవారం దెందులూరులో ఆయన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు తలారి రామకృష్ణ కలిసి మాట్లాడుతూ ఎన్నికల ముందు అన్ని ప్రచార సభల్లో అధికారం పరమావధిగా ఆచరణకు అమలు కాని హామీలిచ్చి నేడు వాటన్నింటినీ చంద్రబాబు విస్మరించారని విమర్శించారు. ఉద్యోగాలు నోటిఫికేషన్ కోసం లక్షలాది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని అన్నారు. పథకాలకు నిధులు ఇవ్వలేమని స్వాక్షాత్తు సీఎం చంద్రబాబు ప్రకటించడం రాష్ట్ర ప్రజలందరినీ మోసం చేయడమేనన్నారు.

సైబర్ నేరాలు, సోషల్ మీడియాతో జీవితాలు నాశనం


రహదారి భద్రతపై విద్యార్థులకు కల్పిస్తున్న పోలీసులు

భీమడోలు: సైబర్ నేరాలు, సోషల్ మీడియా వల్ల కలిగే దుష్పరిణామాలతో ఎందరో జీవితాలు సర్వనాశనమవుతున్నాయని భీమడోలు ఎస్సై వై.సుధాకర్ అన్నారు. మండలంలోని గుండుగొలను, ఆగడాలలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐ యూజే విల్సన్ పర్యవేక్షణలో ఏలూరు అభయ మహిళా రక్షక దళ సభ్యులు, మహిళా పోలీస్ సిబ్బంది, అభయా వాహనం ద్వారా ఎస్సై వై.సుధాకర్ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు ముఖాముఖీ నిర్వహించారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా, రహదారి భద్రతలో భాగంగా హెల్మెట్ల వినియోగం, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వాటి కలిగే అనర్థాలు, వాటి నివారణ చర్యలను వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు హెచ్ఎంలు సునీత, సత్యనారాయణ అధ్యక్షత వహించారు. బాల్య వివాహాలపై 1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సైబర్ నేరాల విషయంలో 1930కు ఫోన్ చేయాలన్నారు. అభయా మహిళా రక్షక దళం సభ్యులు మాట్లాడుతూ మహిళలు, బాలికలు, వృద్ధుల భద్రత కోసం ముందడుగు కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఏఎస్సై వెంకటేశ్వరరావు, మహిళా సంరక్షణ సహాయకురాలు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

ఉంగుటూరు: నారాయణపురం జాతీయ రహదారి పక్కన వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో వెల్లడించారు. 30వ తేదీ గురువారం నుంచి ఫిబ్రవరి 5 వతేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ద్వాదశ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విశేషమైన పూజలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 30న స్వామి అమ్మవార్లను పెళ్లి కుమారుడు,పెళ్లి కుమార్తెలుగా అలంకరిస్తామన్నారు. 31న కల్యాణోత్సవం, 1న పవళింపు సేవ, 2న ఊరేగింపు, 3న ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, 4న శ్రీవారికి ప్రత్యేక పూజలు, పూర్ణ ఏకాహం భజన, 5న అన్న సమారాధన నిర్వహిస్తునట్లు కమిటీ సభ్యులు వివరించారు.

వరిలో ఎరువుల యాజమాన్యం కీలకం

దెందులూరు: వరిలో ఎరువుల యాజమాన్యం అత్యంత కీలకమని, చీడపీడలు యాజమాన్యం నివారణ మందులు వాడకం వ్యవసాయ శాఖ సూచనలు సలహాలు రైతులు విధిగా పాటించాలని డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఫణికుమార్ నాగేంద్రబాబు అన్నారు. బుధవారం పోతునూరులో దెందులూరు మండల వ్యవసాయ శాఖ అధికారి దామా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారి దామా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ నాయకులు బొడ్డేటి మోహన్, నున్న లక్ష్మణ లంక అప్పారావు రైతులు వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

పంట పొలాల పరిశీలన

ఉంగుటూరు: చేబ్రోలులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవ సాయ అధికారి ఎస్.ప్రవీణ్‌కుమార్, పంట పొలాలను పరిశీలించారు. ఈమేరకు రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. చేబ్రోలు రైతులు పాల్గొని వారికి ఎదురవుతున్న సమస్యలను వివరించారు. పంటలకు ఆశించిన తెగుళ్ల నివారణ చర్యలను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ విస్తరణాధికార్లు పాల్గొన్నారు.

నేటి నుంచి హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీ


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ లావణ్య, ఏఓ కరుణానిధి

దెందులూరు: వేగవరం హేలాపురి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ కాలేజి ఆవరణలో గురు, శుక్రవారాల్లో జేఎన్‌టీయూ కాకినాడ ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ బాలబాలికల విభాగాల్లో టోర్నమెంట్ ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ ఎం లావణ్య, కళాశాల ఈవో కరుణానిధి అన్నారు. బుధవారం కళాశాలలో వారు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాలో కళాశాల నుంచి బాలుర విభాగానికి 25 జట్లు, బాలికల విభాగానికి 11 జట్లు ఎంపిక చేస్తామన్నారు. జట్ల కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు, అబ్జర్వర్లతో కలిసి పోటీలు నిర్వహించే క్రీడా ప్రాంగణాన్ని ప్రిన్సిపల్, ఏవో బుధవారం పరిశీలించారు.

రావులపర్రులో విజృంభిస్తున్న దోమలు

- డెంగీ లక్షణాలతో బాధపడుతున్న ప్రజలు
- ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం
- డ్రెయిన్లు శుభ్రం చేయించిన అధికారులు
- వైద్య శిబిరం ఏర్పాటు



రావులపర్రులో వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ మానస

ఉంగుటూరు: ఇరవై రోజులుగా ఉంగుటూరు మండలంలోని రావులపర్రులో జ్వర బాధితుల సంఖ్య పెరుగుతోంది. ప్రధానంగా డ్రెయిన్లు పూడుకుపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచి దోమలు వృద్ధి చెంది వ్యాధుల వ్యాప్తికి కారణమవుతోంది. డ్రెయిన్లలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. అసలే దాళ్వా సాగు, ఆపైన డ్రెయిన్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో దోమలు రావులపర్రులో విజృంభిస్తున్నాయి. దోమల ప్రభావంతో కొందరు దీర్ఘకాలంగా జ్వరంతో బాధపడుతూ, ప్లేట్‌లెట్లు పడిపోవడం వంటి డెంగీ లక్షణాలతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో ప్రజలు ఆసుపత్రులకు పరుగులు పెడుతూ ఆరోగ్యపరంగా, ఆర్థికంగా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ప్రజలు కొందరు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు గాది వెంకట రమణ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల విభాగంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో అర్జీ అందజేశారు. దీంతో ఎంపీడీవో మనోజ్ స్పందించి పంచాయతీలో పరిస్థితిని చక్కదిద్దమని వైద్యసిబ్బంది, పంచాయతీ సెక్రటరీకి ఆదేశాలిచ్చారు. కాగుపాడు పీహెచ్‌సీ డాక్టర్ మానస పీహెచ్‌సీ సిబ్బందితో గ్రామానికి చేరుకుని వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై సర్వే చేసారు. ఇద్దరు జ్వరాలతో బాధపడుతున్నట్టు గుర్తించారు. అవి సాధారణ జ్వరాలేనని మానస తెలిపారు. పలువురికి మందులు ఇచ్చారు. ఈశిబిరం రెండురోజులు కొనసాగుతుందని ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్ తెలిపారు.


రావలుపర్రు వీధుల్లో బ్లీచింగ్ చల్లుతున్న దృశ్యం


రావులపర్రులో పూడుకుపోయిన డ్రెయిన్

పంచాయతీలో పారిశుద్ధ్య పనులు

ఇన్‌చార్జి పంచాయతీ సెక్రటరీ విజయకుమార్ మంగళవారం, బుధవారం గ్రామానికి చేరుకుని పారిశుద్ధ్య సిబ్బందితో డ్రెయిన్లు శుభ్రం చేయించారు. దోమల నివారణ మందును డ్రెయిన్లలో పిచికారీ చేయించారు. రహదార్ల వెంబడి బ్లీచింగ్ చల్లించారు. డ్రెయిన్లు ఆక్రమణకు గురవడంతో పూడుకుపోయాయని ఆయన తెలిపారు. ఆక్రమణలను త్వరలో తొలగిస్తామని విజయకుమార్ చెప్పారు.

దోమల కారణంగా జ్వరాల వ్యాప్తి



రావులపర్రులో జ్వరాలతో అనేక మంది ఇబ్బంది పడ్డారు. ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొంది ఇళ్లకు చేరాం. మా అబ్బాయి మణికంఠ (4)కు డెంగీ లక్షణాలతో జ్వరం రావడంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించాం. అనారోగ్యానికి గురై ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ బాగోలేదు, దోమలు విజృంభిస్తున్నాయి. ఇప్పుడు మా మేనకోడలు భాగ్యశ్రీ జ్వరంతో బాధపడుతోంది.

– కాశీ, రావులపర్రు

ప్లేట్‌లెట్లు పడిపోయాయి



రావులపర్రులో నెలరోజుల నుంచి వైరల్ జ్వరాలతో పాటు డెంగీ లక్షణాలతో చాలామందికి ప్లేట్‌లెట్లు పడిపోయి ఇబ్బంది పడ్డారు. మా ఇంట్లో వాళ్లు కూడా తీవ్ర జ్వరంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందారు. నాభార్య నాగమణి, కుమారుడు రాజాకి ప్లేట్‌లెట్లు పడిపోవడంతో వారిని తాడేపల్లిగూడెంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించి కోలుకున్న తరువాత ఇంటికి తీసుకువచ్చాం.

– ఇబ్బా ముత్యాలరావు, రావులపర్రు

మానవాళికి ఏసుక్రీస్తు బోధనలు ఆదర్శనీయం


హాజరైన విశ్వాసులు, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ పి.సజీవరావు

ఉంగుటూరు: ఏసుక్రీస్తు ప్రభువు జీవితం, ఆయన బోధనలు సర్వమానవాళికి ఆదర్శనీయమని బైబిల్ మిషన్ మహాసభల చైర్మన్ రె.వ.డాక్టర్ పి.సజీవరావు అన్నారు. బుధవారం ఉంగుటూరు శివారు నాచుగుంట వద్ద జాతీయ రహదారికి సమీపంలో నిర్వహిస్తున్న బైబిల్ మిషన్ మహాసభలకు వేలాదిగా వచ్చిన విశ్వాసులునుద్దేశించి సజీవరావు మూడవ రోజు ప్రసంగించారు. ప్రేమతో ఇతరులకు సేవచేసే తత్వం అలవర్చుకోవాలని సజీవరావు విశ్వాసులకు వివరించారు. బైబిల్ మిషన్ కార్యవర్గ సభ్యులుతో, అన్ని సంఘాల సభ్యుల నడుమ మూడవ రోజు ముగింపు కార్యక్రమం, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బైబిల్ మిషన్ మహాసభల ఉపాధ్యక్షుడు డాక్టరు దైవారావు మహాసభల రిపోర్టు నివేదికను వివరించారు. రాజమండ్రికి చెందిన ఎస్.షరోన్‌కుమార్, సుధీర్ కుమార్ దేవదాసు సేవలను వివరించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ధర్మరాజు తమ్ముడు పత్సమట్ల భీమరాజును బైబిల్ మిషన్ గవర్నింగు బాడీ సభ్యులు సత్కరించారు. కార్యదర్శి వైఐడీ ఇమ్మానియేలు, జాయింటు సెక్రటరీ జీఆర్ ఇమ్మానియేలురాజు పాల్గొన్నారు. వేలాది మంది విశ్వాసులు పాల్గొన్నారు.

పాఠశాల స్థలం ఆక్రమణ తొలగింపు

దెందులూరు: చల్లచింతలపూడి పంచాయతీ తిమ్మన్నగూడెం గ్రామం ప్రాథమిక పాఠశాల స్థలాన్ని ఆక్రమించారని ఆరోపిస్తూ గ్రామస్తులు కలెక్టర్ వెట్రిసెల్వికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. డీఈవో, ఎంఈవోలు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ నిర్వహించి నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారని దెందులూరు మండల విద్యాశాఖ అధికారిని కె. అన్నమ్మ తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం పాఠశాలకు వెళ్లి పరిశీలించినట్టు ఎంఈవో తెలిపారు. స్కూల్ కమిటీ సభ్యులతో మాట్లాడి ఆక్రమణ తొలగించామని ఎంఈఓ తెలిపారు.